



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
అక్టోబరు 15, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-

# లొంగిపోయిన మల్లోజుల

## 60 మంది అనుచరులతో మహారాష్ట్రలో లొంగుబాటు

- సోమవారం రాత్రి 10 గంటలకు గడ్చిరోలి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు..
- 7 ఏకే-47 సహా 54 తుపాకులు పోలీసులకు అప్పగింత
- లొంగిపోయినవారిలో ముగ్గురు డీకేఎస్‌జెడ్‌సీ సభ్యులు
- పదిమంది డివిజినల్ కమిటీ సభ్యులు ఉన్నట్లు పోలీసుల వెల్లడి..
- 16న అధికారికంగా ప్రకటించనున్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
- 1980 నుంచి పీపుల్స్‌వార్ ద్వారా సాయుధపోరాటం మొదలు
- 2011లో సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు ఎన్‌కౌంటర్
- అనారోగ్యం, పార్టీతో రాజకీయ విభేదాలతోనే లొంగుబాటు




పెద్దపల్లి: తొలితరం మావోయిస్టు అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను మహారాష్ట్ర పోలీసులకు లొంగిపోయారు. ఆయన తలపై రూ.6 కోట్ల వరకు రివార్డు ఉంది. 60 మంది అనుచరులతో కలిసి ఆయన గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వేణుగోపాల్‌తోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరినీ సోమవారం రాత్రి 10 గంటల సమయంలో హెూద్రి గ్రామం నుంచి పోలీస్ వాహనాల్లోనే గడ్చిరోలి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. లొంగిపోయినవారిలో ముగ్గురు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సభ్యులు, పదిమంది డివిజినల్ కమిటీ సభ్యులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, మల్లోజుల లొంగుబాటును మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ నెల 16న మీడియా సమావేశంలో అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించనున్నారని సమాచారం. మల్లోజుల భార్య, గడ్చిరోలి దళ సభ్యురాలు తారక్క 2024 డిసెంబర్ 31న లొంగిపోయారు. ఆపరేషన్ కగార్ వల్ల పార్టీ ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోవడంతో ఇక పోరాడలేమని గ్రహించి మావోయిస్టు పార్టీలో కొందరు లొంగుబాట పట్టారు. మల్లోజుల కూడా సాయుధ పోరాట పంథాను వీడుతున్నట్లు ఇటీవలే లేఖ విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో మల్లోజుల కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయన సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్ జీ కూడా పార్టీలో అగ్రనేతే. ఆయన 2011లో పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. కిషన్‌జీ భార్య పోతుల కల్పన గతేడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

**లొంగుబాటుకు కారణాలివే..**

వేణుగోపాల్‌కు ప్రస్తుతం 70 ఏళ్లు. ఆయనపై 100కుపైగా కేసులున్నాయి. అనారోగ్య, వ్యక్తిగత కారణాలతోపాటు మారుతున్న రాజకీయ పరిస్థితులు కూడా ఆయన లొంగుబాటుకు కారణమని చెబుతున్నారు. ప్రజల నుంచి రోజురోజుకూ ఆదరణ తగ్గుతుండటం, అడవులపై బలగాల పట్టు పెరిగిన కొద్దీ.. వాటిని వదిలి కొత్త ప్రాంతాలకు వెళ్లడంపై వేణుగోపాల్ విభేదిస్తూ వస్తున్నారు. సాయుధ పోరు వదిలి రాజకీయ వేదికగా ఉద్యమించాలని కొంతకాలంగా చెబుతున్నారు. ఈ విషయంపై ఆగస్టు 15న 'టెంపరరీ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ అబాండెన్'పేరిట విడుదల చేసిన లేఖ సెప్టెంబర్ 17న వెలుగుచూడటం పార్టీలో

(మిగతా 2వ పేజీలో)




# జూబ్లీహిల్స్ ఓట్ చోరీపై నేడు హైకోర్టుకు..

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి.. ఓట్‌చోరీపై రాహుల్ గాంధీ స్పందించాలి
- కాంగ్రెస్ అభ్యర్థి తమ్ముడికే మూడు ఓట్లు ఉన్నాయి.. ఏకంగా 23 వేల ఓట్లు ఎలా పెరిగాయని నిలదీత

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన నకిలీ ఓటర్లను వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. డూప్లికేట్ ఓటర్ల నమోదు ద్వారా అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా విశ్వసనీయత ప్రశ్నార్థకమైన

(మిగతా 2వ పేజీలో)

# ఎపిని అడ్డుకోండి



పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు టెండర్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం సీడబ్ల్యూసీకి లేఖ



## 20 మంది సజీవ దహనం



# నేడు మాగంటి సునీత నామినేషన్

- బీఫామ్‌తో పాటు రూ.40 లక్షల చెక్కు ఇచ్చిన కేసీఆర్
- 19న భారీ ర్యాలీతో మరోమారు నామినేషన్

## 'అగ్రకులాల వాళ్లు వెళ్తుంటే.. ఇప్పటికీ లేచి నిలబడుతున్నారు!' ::: సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: ఓబీసీ రిజర్వేషన్ల పెంపు నిర్ణయాన్ని సమర్థించుకుంటూ.. ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో మధ్యప్రదేశ్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే 15,000 పేజీల ఆ అఫిడవిట్ ఆసక్తికర అంశాలనే పొందుపరిచింది. ప్రాచీన భారతంలో లేని కుల వివక్ష.. విదేశీ ఆక్రమణల కాలం నుంచే మొదలైందని, అది ఇప్పటికీ సమాజంలో కొనసాగుతోందంటూ ఉదాహరణలతో సహా అందులో ప్రస్తావించింది. మధ్యప్రదేశ్

(మిగతా 2వ పేజీలో)

# మీ అభివృద్ధిలో భారత్ విశ్వసనీయ భాగస్వామి



- మంగోలియా అధ్యక్షుడు ఖురెల్‌సుఖ్ ఉఖ్నాతో ప్రధాని మోదీ
- ఇరువురు నేతల మధ్య కొనసాగిన ద్వైపాక్షిక చర్చలు
- మంగోలియా పౌరులకు ఉచితంగా ఈ-వీసాలిస్తామన్న మోదీ

న్యూఢిల్లీ: మంగోలియా దేశాభివృద్ధిలో భారత్ విశ్వసనీయ భాగస్వామి పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నాలుగురోజుల భారత పర్యటనలో భాగంగా మంగళవారం ఢిల్లీకి చేరుకున్న మంగోలియా అధ్యక్షుడు ఉఖ్నా ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఉఖ్నా భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఇరువురి ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ మాట్లాడారు. " భారత్, మంగోలియా బంధం కేవలం ద్వైపాక్షికం కాదు. అంతకుమించిన గాఢమైన, ఆత్మీయ, ఆధ్యాత్మిక బంధం. మన ఇరుదేశాల భాగస్వామ్యం ఇరు దేశాల ప్రజల సత్సంబంధాల్లో ప్రతిబింబిస్తోంది. భారత్ అందించిన

(మిగతా 2వ పేజీలో)

# లొంగిపోయిన మల్లోజుల

కలకలం రేపింది. పార్టీలో తీవ్ర చర్చకు దారితీయడంతో ఆయుధాలు సరెండర్ చేయాలని పార్టీ ఆదేశించింది. వేణుగోపాల్ లొంగుబాటును మహారాష్ట్ర గడ్చిరోలి, ఉత్తర బస్తర్, దండకారణ్యంలోని మెజారిటీ మావోయిస్టు అనుచరగణం సమర్థిస్తోంది. కానీ, మావోయిస్టు అగ్రనేతలు పుల్లూరి ప్రసాద్, పార్టీ తెలంగాణ కమిటీ, సెంట్రల్ కమిటీ నేతలు ఆయన నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు.

**తండ్రి బాటలో పోరాట మార్గం..**

మల్లోజుల వేణుగోపాల్‌ది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా కేంద్రం). బ్రాహ్మణ కుటుంబంలో 1956లో ఆయన జన్మించారు. తండ్రి మల్లోజుల వెంకటయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా తామ్రపత్రం అందుకున్నారు. ఆయన వెంకటయ్య 1997లో మరణించారు. తల్లి మధురమ్మ గతేడాది కాలం చేశారు. మరో సోదరుడు ఆంజనేయులు కేడీసీసీ బ్యాంకులో పనిచేసి రిటైరయ్యారు. తండ్రి బాటలోనే పేద ప్రజల హక్కుల కోసం మల్లోజుల కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్ ఉద్యమించారు. జగిత్యాల జైత్రయాత్ర అనంతరం 1978లో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1980లో పీపుల్స్‌వార్ ఆవిర్భావ సభ్యులుగా వ్యవహరించారు. 1986లో పెద్దపల్లిలో డీఎస్పీ బుచ్చిరెడ్డిని అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్ కాల్చి చంపారు. ఆగ్రహించిన పోలీసులు వెంకటయ్య %–% మధురమ్మ ఇంటిని కూల్చివేశారు. దీంతో కొంతకాలం వారు గుడిసెలో తలదాచుకున్నారు. వేణుగోపాల్ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి అధినేతగా పనిచేశారు. మహారాష్ట్ర, ఏపీ, గోవాతోపాటు పశ్చిమ కనుమల్లో పార్టీ కార్యకలాపాలు విస్తరించారు. 2010లో పార్టీ అధికార ప్రతినిధి చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్ మరణం తరువాత ఆయన స్థానాన్ని భర్తీ చేశారు. 2010లో గడ్చిరోలిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల ఊచకోతలో ఇతనే మాస్టర్ మైండ్ అని పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. 2011లో పశ్చిమబెంగాల్



పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఆయన సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు మరణించారు. ఆ తరువాత సెంట్రల్ ఇండియా అడవుల్లో పార్టీని బలోపేతం చేయడంలో వేణుగోపాల్ వ్యూహాలు రచించారు. ఆయన గడ్చిరోలి జిల్లాలో పనిచేసే సమయంలో తారక్కను వివాహమాడారు. 2018లో ఆమె మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. 44 ఏళ్లపాటు అజ్ఞాతంలోనే ఉన్న ఆయన పార్టీ విధానాలతో విబేధించి జనజీవన స్రవంతిలో కలిశారు. వేణుగోపాల్ తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కోయ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరని చెబుతారు. 'సాధన'అనే కలం పేరుతో గోండుల జీవితాలకు అక్షరరూపం ఇచ్చారు. సరిహద్దు, రాగో అనే నవలు రాశారు.

**అడవి నుంచి అమ్మకు లేఖ**


తన తల్లి మధురమ్మ అంత్యక్రియలకు రాలేకపోయిన వేణుగోపాల్.. మీడియాలో కథనాలు చూసి 'అమ్మా.. నన్ను మన్నించు'అని లేఖ రాశారు. 'నీకు, అమరుడైన నా సోదరునికి.. మన కుటుంబానికి ఏ కలంకం రాకుండా, జనానికి దూరం కాకుండా తుదివరకూ నమ్మిన ఆశయాల కోసం నిలబడతానని మరోసారి హామీ ఇస్తున్నా.. అమ్మా'అంటూ లేఖ విడుదల చేశారు. దానికి విరుద్ధంగా వేణుగోపాల్ లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

# జూబ్లీహిల్స్ ఓట్ చోరీపై నేడు హైకోర్టుకు..

నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించాలన్నారు. తాము లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. ఓట్ చోరీకి సంబంధించిన రుజువులను తమ పార్టీ కార్యకర్తల సహకారంతో రెండు రోజుల వ్యవధిలోనే ప్రజల ముందు పెట్టామన్నారు. అయినా ఎన్నికల కమిషన్ ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఓటరు జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలపై మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తాము రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసి 24 గంటలు దాటినా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బుధవారం హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు కేటీఆర్ చెప్పారు.

**అసాధారణంగా ఓట్లు పెరిగాయ్..**

'తెలంగాణ ఓట్ చోరీ అంశంపై రాహుల్ గాంధీ స్పందించాలి. బిహార్‌లో ఓటు చోరీ జరిగితే తెలంగాణలో ఓట్ల చోరీ ద్వారా ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోంది. రాహుల్ గాంధీ రాజ్యాంగం ప్రతులను చేతిలో పట్టుకొని అన్ని రాష్ట్రాల్లో నీతి సూక్తులు వల్లె వేస్తున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం దొంగ ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని యత్నిస్తోంది. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కింది అధికారులతో కుమ్మక్కైన అంశాన్ని రాహుల్ గాంధీ పరిగణనలోకి తీసుకొని ఇక్కడ జరిగిన దొంగ ఓట్ల అంశంపై స్పందించాలి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా 23వేల ఓట్లు పెరిగాయని ఎన్నికల సంఘం చెబుతోంది. మరో 12వేల ఓట్లు తొలగించామని చెబుతున్నా అసాధారణంగా ఓట్లు పెరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన వ్యక్తి అక్రమంగా ఓటరు ఐడీ కార్డులను పంపిణీ చేయడంపై ఎన్నికల సంఘం కేసు కూడా నమోదు చేసింది.




కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ సొంత తమ్ముడు వెంకట్ ప్రవీణ్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎన్నికల అక్రమాల కోసం కిందిస్థాయి అధికారులను కాంగ్రెస్ ఉపయోగించుకుందనే అనుమానం ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికి మూడు ఓట్లు ఉన్న తర్వాత స్వేచ్ఛగా ఎన్నిక జరుగుతుందని ఎలా అనుకోవాలి. ఎన్ని రకాల కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారు'అని కేటీఆర్ పేర్కొన్నారు.



# 20 మంది సజీవ దహనం

రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సులో మంటలు చెలరేగి 20 మంది సజీవ దహనమయ్యారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను స్థానిక జవహర్‌ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. జైసల్మేర్ నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రైవేట్ బస్సు జోధ్‌పూర్ బయలుదేరింది. జైసల్మేర్‌కు 20కిమీ దూరంలో థాయత్ గ్రామ సమీపంలో బస్సు వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, క్షణాల్లోనే బస్సంతా వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు భయంతో కేకలు వేయడంతో స్థానికులు స్పందించి ఫైర్ సిబ్బందికి తెలియజేశారు. బాధితులకు సహాయ చ ర్యలు చేపట్టారు. బస్సులో మొత్తం 57మంది ప్రయాణికులు ఉన్నారు. మృ తుల్లో నలుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు, ఉన్నారని జైసల్మేర్ మున్సిపల్ కౌన్సిల్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ క్రిష్ణపాల్ సింగ్ రథోర్ వెల్లడించారు. బస్సులో ఉన్న వారిలో కొందరు కిటికీలు పగుల గొట్టి బయటపడ్డారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బస్సు ఇంజిన్ లేదా వైరింగ్ షార్టు సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు. రాజస్థాన్ సిఎం భజన్‌లాల్ శర్మ మృతుల కుటుంబాలకు సంతాపం వెలిబుచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# 'అగ్రకులాల వాళ్లు వెళ్తుంటే.. ఇప్పటికీ లేచి నిలబడుతున్నారు!'

బీజేపీ ప్రభుత్వం ఏప్రిల్ 21, 2021లో.. ఓబీసీ రిజర్వేషన్లను 14 శాతం నుంచి 27 శాతానికి పెంచింది. దీంతో మొత్తం రిజర్వేషన్లు 73 శాతానికి చేరాయి. అయితే ఇది రాజ్యాంగ విరుద్ధంగా 50% రిజర్వేషన్ పరిమితిని ఉల్లఘించేలా ఉందని(ఇంద్రా సాహ్నీ కేసు), ఈ నిర్ణయం రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నమేనని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో రాజ్యాంగ పరిమితులు, సామాజిక న్యాయం మధ్య సమతుల్యతపై చర్చ మొదలైంది. ఈ లోపు.. నిశ్చయ సోనిర్బే అనే ఓబీసీ నేతతో పాటు ఎనిమిది మంది ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో అఫిడవిట్ దాఖలు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తాజాగా.. ఆ అఫిడవిట్‌లో రిజర్వేషన్ల పెంపు నిర్ణయాన్ని మధ్యప్రదేశ్ బీజేపీ ప్రభుత్వం సమర్థించుకుంది. ప్రాచీన భారతదేశం కులాల లేని, ప్రతిభ ఆధారిత సమాజంగా ఉండేదని అందులో ప్రముఖంగా పేర్కొంది. వేద కాలాన్ని సమానత్వ యుగంగా అభివర్ణిస్తూ.. విదేశీ ఆక్రమణల వల్ల కుల వివక్ష వచ్చిందని తెలిపింది. అదే సమయంలో, రైతులు, కళాకారులపై కుల ఆధారిత దోపిడీ వల్ల దేశ ఆర్థిక పతనం జరిగిందని పేర్కొంది. వర్గ వివక్ష ఇంకా కొనసాగుతోందని వాదించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ శాఖల్లో



56% ఓబీసీ ఉద్యోగులు.. ఉన్నత కులాల వారు పక్కన నుంచి పోతుంటే ఇప్పటికీ లేచి నిలబడతారు అని ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ క్రమంలో.. దామోహ్‌లో జరిగిన ఓ ఘటనను ప్రముఖంగా ప్రస్తావించింది. ఓబీసీ కుష్వాహా వర్గానికి చెందిన ఓ యువకుడు, ఓ బ్రాహ్మణుడి ఏఐ ఇమేజ్ క్రియేట్ చేశాడని పాదాలు కడిగించి.. బలవంతంగా ఆ నీటిని తాగించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో కేసు నమోదైంది కూడా. ఇలాంటి ఘటనలతో.. కుల వివక్ష సమాజంలో పేరుకుపోయిందనే విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించాలని విజ్ఞప్తి చేసింది. జాతి నిర్మాణంలో భాగంగానే.. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే నినాదంతో.. ఓబీసీ రిజర్వేషన్లను పెంచామని అఫిడవిట్‌లో పేర్కొంది. ఇదే కాదు.. సుదీర్ఘమైన అఫిడవిట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సోషల్ సైన్స్ యూనివర్సిటీ 2023లో గోప్యంగా నిర్వహించిన ఓ సర్వే వివరాలను పొందుపరిచింది. మధ్యప్రదేశ్ వ్యాప్తంగా 10 వేల గ్రామీణ కుటుంబాలను ఈ సర్వేలో భాగం చేశారు. ఇందులో 5,578 మంది అంటే 56 శాతం.. అగ్రవర్ణాల వాళ్లు తమ నుంచి గౌరవాన్ని ఆశిస్తున్నారని, ఆఖరికి వాళ్లు వెళ్తుంటే మంచంలో కూడా కూర్చోనివ్వరని.. లేచి నిలబడి గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. 3,397 కుటుంబాలు అంటరానితనం, అస్పృశ్యత కొనసాగుతున్నట్లు వెల్లడించారు. 3,763 కుటుంబాలు.. కలిసి భోజనం చేసేందుకు ఇతర కులాల వాళ్లు అంగీకరించరని తెలిపారు. చివరకు.. కులం కారణంగానే తమ ఇళ్లలో పూజలు నిర్వహించేందుకు పూజారులు ముందుకు రావడం లేదని 3,238 మంది తెలిపారు. ఓబీసీకి చెందిన సగం మహిళలు.. వ్యవసాయ కూలీలుగానో, కూలీ పనులు చేసుకుంటున్నో గడుపుతున్నారని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ఓబీసీల జనాభా అత్యధికంగా ఉందని.. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో తక్కువ ప్రాతినిధ్యం కలిగి ఉన్నారని వాదించింది. అయితే ఈ అఫిడవిట్‌లో సాంకేతిక అంశాలు ఇంకా పరిశీలించాల్సి ఉందని పేర్కొంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టును సమయం కోరారు. దీనిపై ద్విసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది రోజువారీ విచారణకు అనుకూలమైన కేసు అని, వాయిదాలు వల్ల ప్రజలకు న్యాయం ఆలస్యం అవుతుందని తెలిపింది. అత్యంత ప్రాధాన్యత గల కేసుగా అభివర్ణిస్తూనే.. చివరకు నవంబర్ 9వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించగా.. దానిని ఎత్తివేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఇటు మధ్యప్రదేశ్ రిజర్వేషన్ కోటా పిటిషన్ విచారణ కొనసాగుతుండడం గమనార్హం.



## ఈనెల 18న బీసీల బంద్ జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ అక్టోబర్ 14:- (వార్త మిర్రర్) : బిసి రిజర్వేషన్ సాధన కోసం ఈనెల 18న తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను మంగళవారం బీసీ సంఘాల నాయకులు ఆవిష్కరించి పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థి యువజన బీసీ కుల సంక్షేమ సంఘం నాయకులు ఐక్యంగా మిర్యాలగూడ డివిజన్ బీసీ సంఘం జేఏసీ చైర్మన్ గా జి.నాగేశ్వరరావు యాదవ్, బీసీ యువజన విద్యార్థి సంఘ చైర్మన్ గా గాధగోని మహేష్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్స్ దాసరాజు జయరాజు, ఈశ్వర చారి, చేగొండి మురళి యాదవ్, రాజు, బంటు వెంకటేశ్వర్లు, దుర్గయ్య గౌరవ సలహాదారులు నాగేందర్, రామకృష్ణ, మహిళా అధ్యక్షులు జయమ్మ, సావిత్రి, బిసి విద్యార్థి సంఘం నాయకులు సురేష్ యాదవ్, అశోక్ చారి, శరత్, నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కృష్ణ, ముదిరాజ్, సంఘం అధ్యక్షుడు రాజు ముదిరాజ్ ప్రజాసేవ అధ్యక్షులు మనీ, నిరుద్యోగ యువత కృష్ణ రాజు, అనిల్, భీమరాజు, జ్యోతి, రమేష్, కిష్టరాజు, నరేందర్, రమేష్, నరేష్, శంకర్, మంజుల, రామకృష్ణ, జ్యోతి, భవాని, రాణి, సరిత, సావిత్రి, వసంత ఉన్నారు.



## మిర్యాలగూడలో బీసీ రిజర్వేషన్లకై రాస్తారోకో

మిర్యాలగూడ , అక్టోబర్ 14:-( వార్త మిర్రర్) : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ మిర్యాలగూడలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఎదుట మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ బీసీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. బీసీలపై ఎన్నికల సమయంలో మాత్రమే కపట ప్రేమలు చూపించి బీసీల ఓట్లు దండుకుంటున్నారే తప్ప బీసీలకు రాజ్యాంగపరంగా దక్కవలసినటువంటి రిజర్వేషన్లకు ఇచ్చేందుకు ఏ రాజకీయ పార్టీ ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు మద్దతుగా ప్రతి రాజకీయ పార్టీ ఉద్యమానికి సిద్ధం కాకపోతే ప్రతి రాజకీయ పార్టీ కార్యాలయం ఎదుట బీసీలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రతి రాజకీయ పార్టీలో ఉన్నటువంటి బీసీలు కుల సంఘాలు ఉద్యమానికి ముందుకు రావాలన్నారు. జరిగే బీసీల ఉద్యమం తోనే భవిష్యత్తు రాజకీయాలు ఉంటాయి కాబట్టి బీసీ లందరూ సంఘటితంగా ముందుకు వచ్చి తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలు రాజ్యం ఏలుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలగాని వెంకటేష్, జట్కా నాగేశ్వరరావు, ఎర్రబెల్లి గంగాధర్, పట్టేటి రమేష్, వీరస్వామి, శంకర్, శ్యామ్, సురేష్, ఉపేందర్, నవీన్, సిద్ధంరాజు పాల్గొన్నారు.

## నేడు మాగంటి సునీత నామినేషన్

**బీఫామ్‌తో పాటు రూ.40 లక్షల చెక్కు ఇచ్చిన కేసీఆర్**

**19న భారీ ర్యాలీతో మరోమారు నామినేషన్**

హైదరాబాద్: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నా రు. హంగూఆర్భాటానికి తావు లేకుండా తొలిసెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మరో నలుగురితో వెళ్లి నామినేషన్ వేస్తారు. ఈ నెల 19న మరో సెట్ నామి నేషన్ పత్రాల దాఖలు సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహణకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలందరూ ఈ ర్యాలీలో పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాగా మాగంటి సునీత మంగళవారం ఎర్రవల్లి నివా సంలో పార్టీ అధినేత కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ చేతుల మీదుగా సునీత బీఫామ్‌ను అందుకున్నారు. ఎన్నికల ఖర్చు కోసం పార్టీ తరఫున సునీతకు రూ. 40 లక్షల చెక్కును కూడా కేసీఆర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్ కుటుంబ సభ్యులతోపాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

## మీ అభివృద్ధిలో భారత్ విశ్వసనీయ భాగస్వామి

1.7 బిలియన్ డాలర్ల ఆర్థికసాయంతో మంగోలియాలో చేపట్టిన చమురు శుద్ధి కర్మాగారం ప్రాజెక్ట్ ఆ దేశ ఇంధన రక్షణకు మరింత భద్రత చేకూరుస్తుంది. విదేశాల్లో భారత్ చేపట్టిన అతిపెద్ద అభివృద్ధి భాగస్వామ్య ప్రాజెక్ట్ ఇదే. ఇందులో మంగోలియా సిబ్బందితోపాటు 2,500 మందికిపైగా భారతీయ నిపుణులు పనిచేస్తూ ఈ ప్రాజెక్ట్‌ను సుసాధ్యం చేస్తున్నారు. ఇది మాత్రమేకాకుండా ఎన్నో అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాల భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. ఇండో%–%పసిఫిక్‌లో స్వేచ్ఛా, సులభతర, సమగ్రత వాణిజ్యానికి ఇరుదేశాలు కృషిచేస్తున్నాయి. గ్లోబల్ సౌత్ వాణిని గట్టిగా ఇరుదేశాలు గట్టిగా వినిపిస్తున్నాయి. మంగోలియా పౌరులకు భారత్ ఉచితంగా ఈ%–%వీసాలను అందించనుంది" అని మోదీ చెప్పారు.

**పలు రంగాల్లో పరస్పర సహకారం**

ఈ సందర్భంగా ఉఖ్నా భారత్‌ను పొగిడారు. "స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ అద్భుతంగా నాయకత్వ పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ సౌరకూటమిలోనూ భారత్ తనదైన కీలక భూమిక పోషిస్తోంది" అని శ్లాఘించారు. తర్వాత మోదీ మాట్లాడారు. "బౌద్ధమతం విషయంలో ఇరుదేశాలు తోబుట్టువులే. గౌతమ బుద్ధుడి ముఖ్య శిష్యులైన సరిపుత్ర, మౌద్గల్యయానల పవిత్ర అవశేషాలు వచ్చే ఏడాది మంగోలియాకు భారత్ అప్పగించనుంది. గందన్ బౌద్ధారామానికి భారత్ త్వరలో ఒక సాంస్కృతిక ఉపాధ్యాయుడిని పంపనుంది. ఆయన అక్కడి బౌద్ధ ప్రాచీన ప్రతులను అధ్యయనం చేయనున్నారు. మంగోలియాలో బౌద్ధమత వ్యాప్తికి నాటి బిహార్‌లోని పురాతన నలంద విశ్వవిద్యాలయం ఎంతగానో సాయపడింది. ఇప్పుడు అదే రీతిలో గందన్ మఠం, నలంద వర్సిటీల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తాం "అని మోదీ చెప్పారు. "లద్దాఖ్ స్వయంప్రతిపత్తి పర్వతప్రాంత అభివృద్ధి మండలి, మంగోలియాలోని అరా?ంగాయ్ ప్రావిన్స్‌ల మధ్య సాంస్కృతిక బంధం బలపడేందుకు మంగళవారం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం.



## ఓటుకు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ.

కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, అక్టోబర్ 14.

కోరుట్ల పట్టణంలో గల 30 వవార్డు లో ఈ రోజు దేశం లో రాహుల్ గాంధీ పిలుపు మేరకు నరేంద్ర మోదీ బీజేపీ పార్టీ చేసిన ఓట్ చోరీకి నిరసనగా తెలంగాణ రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు, జువ్వాడి కృష్ణ రావు సూచన మేరకు శ్రీ తిరుమల గంగాధర్ అన్న సమక్షంలో 30 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏంబేరి సత్యనారాయణ ఆధ్వర్యంలో (ఓట్ల దొంగతనం) ఓట్ చోరీ సిగ్నేచర్ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ తిరుమల గంగాధర్, మహమ్మద్ ఆరిఫ్, ఏంబేరి రవి,, ఫహీం, మరియు మహిళ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సెమినార్ కు ఎంపిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 14



తెలంగాణ రాష్ట్ర పరిశోధన శిక్షణ సంస్థ "విద్యార్థుల యొక్క విద్యాపరమైన అభివృద్ధిలో కౌన్సెలింగ్ యొక్క పాత్ర" అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధన పత్రాలు ఆహ్వానించగా, రాయికల్ మండలంలోని కుమ్మరి పల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ "విద్యార్థులలో ఉత్తమ ప్రవర్తనా మార్పులను పెంపొందించుట" అనే అంశంపై రూపొందించిన పరిశోధన పత్రం " ఒత్తిడి నుండి విజయం వైపు - సమస్యల నుండి పరిష్కారాల వైపు" ఎంపిక కావడం జరిగింది. ఈ నెల 15 వ తేదీన హైదరాబాద్ లో నిర్వహించే సెమినార్ లో అభయ్ రాజ్ తన పరిశోధన పత్రం ప్రదర్శించనున్నారని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు తెలిపారు. ఈ సందర్భంగా అభయ్ రాజ్ ను జిల్లా విద్యాధికారి రాము, సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, రాజేష్, మహేష్, పీఆర్ టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొన్నం రమేష్, కుంబాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు అమర్ నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, మండల అధ్యక్షులు అంతడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి, ఉపాధ్యాయులు హరికృష్ణ, వినోద్, తదితరులు అభినందించారు.



## తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

### - మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి అక్టోబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మున్సిపాలిటీ లోని 57 సర్వే భూముల పై కొనసాగుతున్న వివాదం నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ భూ వ్యవహారం పై మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఎడ్మ సత్యం మరియు శ్రీశైలం వై ఆర్ ఆర్ కాంప్లెక్స్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... ఎంపీడీవో కార్యాలయం వెనుక ఉన్న భూమి (సర్వే నెం. 57)పై కాంగ్రెస్ నాయకుడు బృంగి ఆనంద్ కుమార్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు."ఈ ప్లాట్లతో బిఆర్ఎస్ నాయకులకు ఎలాంటి సంబంధం లేదు. కుట్రపూరితమైన ఆరోపణలు చేసి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నించకండి అని హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన పనులు చేయాలని సూచిస్తూ, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ఆరోపణలు సహించబోమని స్పష్టం చేశారు. అబద్ధపు మాటలతో నిజాన్ని దాయలేరని అన్నారు. దొంగే దొంగ దొంగ అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని, హెచ్చరించారు.అంతేకాక, మున్సిపల్ కమిషనర్ 57 సర్వే భూ వివాదం పై స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తున్నాయి.



## విద్యానగర్ మట్టి రోడ్డు విధ్వంసమైన పట్టించుకోరా..?

కల్వకుర్తి, అక్టోబర్ 14 (వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీ, 11వ వార్డు కాలనీవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. విద్యానగర్ ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు జరిగాయి. కానీ 11వ వార్డును మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.ఎక్కడ చూసినా గుంతలు, బురద మట్టి రోడ్డులు పూర్తిగా విధ్వంసమైపోయినప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని కాలనీవాసులను ఆగ్రహానికి గురవుతున్నారు. "ఇతర కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతుంటే,విద్యానగర్ 11వ వార్డు నే ఎందుకు మినహాయిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై నిలిచిన నీరు, బురద కారణంగా కార్లు, బైకులు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న పిల్లల నుంచీ పెద్దల వరకూ గాయాలపాలవుతున్నారు. "ప్రతీరోజూ ప్రజా ప్రతినిధులు ఇదే రోడ్డు గుండా వెళ్తున్నారు. అయినా ఎందుకు స్పందించడంలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇటీవలే కురిసిన భారీ వర్షాల వలన పరిస్థితి మరింత దారుణంగా మారిందని కాలిని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అట్రాసిటీ స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టిన డి.ఎస్.పి.

కోరుట్ల, వార్త మిర్రర్ అక్టోబర్14 : కోరుట్ల పట్టణంలో విలీనమైన యెకీన్పూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన భూ వివాద స్థలాన్ని డి.ఎస్.పి అడ్డూరి రాములు అక్టోబర్ 10 శుక్రవారం రోజున పరిశీలించారు. విషయాలు ఆరా తీయగా బాధితుని వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు "బుద్ధి హేమంత్ కుమార్ ఎస్సి మాల" వారి తాత యెకీన్పూర్ గ్రామానికి చెందిన "బద్ది పోతయ్య" యొక్క సర్వే నెంబరు 259 లోని 8 గుంటల భూమికి సంబంధించి నలుగురు కుమారులు వారసులు ఉన్నారు. "బద్ది పోతయ్య" యొక్క చిన్న కుమారుడు "నర్సయ్య" అక్రమంగా భూమి మొత్తాన్ని తన పేరు మీద మ్యుటేషన్ చేయించుకున్నాడు. "నర్సయ్య" కుమారుడు "బద్ది రవిబాబు", "నర్మద" అదే గ్రామానికి చెందిన "చొప్పరి రవి కులం ముదిరాజ్" తో కలిసి అక్రమంగా ఇతరులకు ఆ భూమిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. విషయం తెలుసుకున్న రెండువ కుమారుడి కొడుకు బాధితుడైన "బద్ది హేమంత్ కుమార్" పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మ్యుటేషన్ ఆగిపోయింది. ఫిర్యాదు వెనుకకు తీసుకున్నచో తనకు చెందాల్సిన రెండు గుంటల భూమిని ఇస్తామని "నర్సయ్య", "చొప్పరి రవి" "హేమంత్ కుమార్" కు హామీ ఇవ్వడంతో ఫిర్యాదు వెనక్కి తీసుకున్నాడు. కాని వారు మాట తప్పి మోసం చేశారు. ఇందులో "బద్ది హేమంత్ కుమార్" కి వారసత్వపు వాట ఉందని తెలిసి కూడా కుట్రపూర్వితంగా "చొప్పరి రవి" భూమిని అమ్మి "బద్ది రవిబాబు", "బద్ది నర్మదా" ఇతరులు కలిసి ఆర్థిక లాభం పొందారు.మోసపోయిన "హేమంత్ కుమార్" మళ్ళీ కోరుట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కానీ పోలీసులు పట్టించుకోకపోవడంతో కోరుట్ల పట్టణానికి చెందిన అడ్వకేట్ (న్యాయవాది) అయినా "బద్ది నర్సయ్య" ప్రైవేట్



కంప్లైంట్ ద్వారా కోర్టు ఆర్డర్ తో కోరుట్ల పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నెంబరు 364/2025 ఐపిసి ఎస్సి/ఎస్టి అట్రాసిటీ ఆక్ట్ కేసు నమోదు కావడంతో కోరుట్ల సిఐ "సురేష్ బాబు", ఎస్ఐ "చిరంజీవి" సమక్షంలో మెట్పల్లి డి.ఎస్.పి "రాములు" వివాదాస్పద స్థలాన్ని సందర్శించి, "హేమంత్ కుమార్" వాంగ్మూలం వీడియో రూపకంగా రికార్డు చేసి విచారణ చేపట్టారు.

## పుట్టపాకలో నేతన్నలకు ఉచిత కంటి అద్దాల పంపిణీ

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్ 14( వార్త మిర్రర్): నారాయణపూర్ మండల కేంద్రంలోనిపుట్టపాక గ్రామంలో క్రియేటర్ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఫౌండర్ సామల భాస్కర్ ఆధ్వర్యంలో యంగ్ ఇండియన్స్ చైర్మన్ అశ్విన్ అగర్వాల్, కో చైర్మన్ పూనమ్ అగర్వాల్, గ్రామీణ ఇనిషియేటివ్ చైర్మన్ అర్జున్ కేడియా, కో చైర్మన్ నిఖిల్ బహేటి సౌజన్యంతో ఈరోజు పద్మశాలి చేనేత కళాకారులకు ఉచితంగా కంటి అద్దాలను ఇవ్వడం జరిగినది.ట్రస్ట్ ఫౌండర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుటకు పద్మశాలి చేనేత కళాకారులందరూ ఏకతాటిపై ఉండి, మన జీవన స్థితిగతులు మారడానికి ప్రతి చేనేత సమావేశాలకు హాజరుకావాలని, మన హక్కులు మన వాటాను సాధించుకోవాలని అన్నారు. ఇండియన్స్ వారికి పుట్టపాక గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎంగ్ ఇండియన్స్ అధినేత ఈ యొక్క కార్యక్రమంలో పుట్టపాక పద్మశాలి సంఘం అధ్యక్షులు గజం హనుమంతు, రాష్ట్ర పద్మశాలి మహిళా సంఘం ఉపాధ్యక్షులు శ్రీమతి సామల విజయలక్ష్మి, మండల పద్మశాలి నాయకులు గజం వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు పానుగంటి వెంకట్రావు, కోశాధికారి అయిటిపాముల శంకర్,



సహాయ కార్యదర్శి రావిరాల మల్లేష్, కార్యవర్గ సభ్యులు గంజి శంకరయ్య, వాసం మహేష్, సామల యాదయ్య, తడక వెంకటేశ్వర్లు, గుండు చంద్రకళ, గజం నిర్మల, పానుగంటి పద్మ మరియు పద్మశాలి చేనేత కళాకారులు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక దేవాలయాలు

### సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి అక్టోబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఖానాపూర్ గ్రామ పంచాయతీకర్కాస్ తండాలో పర్యటించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కర్కాస తండాలోని హనుమాన్ దేవాలయం, నిర్మాణంలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన పూజలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ... దేవాలయాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు అని వాటిని మన భవిష్యత్తు తరాలకు అందించడం మన బాధ్యత అని,గత మూడు సంవత్సరాల నుండి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపుగా 160 పైగా దేవాలయాల అభివృద్ధికి మా ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహకారం అందించమనిమంగళవారం కర్కాస్ తండా పర్యటనలో బాగంగా తండావాసుల కోరిక మేరకు నిర్మాణంలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందిస్తానని తెలుపుతూ,ఆలయానికి గ్రిల్స్ నిర్మాణంతో పాటు,పెయింటింగ్ పనుల పూర్తికి హామీ ఇవ్వడం జరిగింది.తనను తండాకు ఆహ్వానించి,ఇంత గొప్ప స్వాగతం పలికిన తండా ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోఖానాపూర్ మాజీ సర్పంచ్ లు బొజ్జ వెంకట్రాం రెడ్డితో పాటు శంకర్ నాయక్,



గంగ నరసింహ,మాజీ ఉప సర్పంచ్ లు రవి,కరుణాకర్ రెడ్డి,స్థానిక నాయకులు గోపాల్ నాయక్,శ్రీను,శివాజీ,మల్లేష్,యువజన నాయకులు రాజేందర్,నర్య,సంతోష్,చిన్న కృష్ణ,బాల కోటి, దేవేందర్,అంజ్య, శంకర్,రాజు లతో పాటు తదితరులు పాల్గొన్నారు..

## రాయికల్ లో ఘనంగా పోషణ మాసం వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 14 : జగిత్యాల జిల్లా పట్టణంలోని-3, 7 అంగన్వాడీ సెంటర్లలో పోషణ మాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి మాట్లాడుతూ.... పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు విటమిన్-సి ఉన్న నిమ్మ, దానిమ్మ, క్యారెట్, బీట్రూట్, ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, అటుకులు, బెల్లం, ఖర్జూరం, నువ్వులు, పల్లీలు, పుట్నాలు, చిరుధాన్యాలు, పప్పులు వంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్ ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలని అవగాహన కల్పించారు. గర్భిణీలు రెండు టిటీలను తప్పనిసరిగా వేయించుకోవాలని, అవసరమైతే 102,108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీ రోజుకు కనీసం రెండు గంటలు విశ్రాంతి తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు.రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. పిల్లలమేధో, భాషా, సాంస్కృతిక అభివృద్ధికి మట్టి బొమ్మలు, చెక్క బొమ్మలు, పూసలు గుచ్చడం, కాగితాల చింపడం వంటి సృజనాత్మక ఆటల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు రక్తహీనత నివారణ,వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించారు. సామ్యా పిల్లలకు ప్రతినెల బాలామృతం ప్లేస్ అందించబడుతుందని, ప్రతి నెల 1వ, 15వ తేదీల్లో పిల్లల బరువులు తూకం వేయడం



జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.వనిత, ఏ.రజిత, ఏఎన్ఎం విజయలక్ష్మి, జుబేదా ఫాతిమా, ఆశ వర్కర్లు వసంత, విజయలక్ష్మి, తల్లులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## రాయికల్‌లో స్ట్రీట్ వెండర్లకు డిజిటల్ ఆన్‌బోర్డింగ్

### పోస్టాఫీస్ ఆధ్వర్యంలో స్కానర్‌ల పంపిణీ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 14

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్లకు డిజిటల్ ఆన్‌బోర్డింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్లకు డిజిటల్ లావాదేవీల సౌలభ్యం కోసం స్కానర్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ ప్రధాన అతిథిగా పాల్గొని, డిజిటల్ పద్ధతులు అవలంబించడం వల్ల వ్యాపారంలో పారదర్శకతతో పాటు ఆర్థిక లావాదేవీలలో సౌకర్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా టి.ఎం.సి శరణ్య, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారిని కళ్యాణి, ఆర్పీలు, స్థానిక స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పట్టణంలోని చిన్న వ్యాపారులకు డిజిటల్ యుగంలో అడుగుపెట్టే అవకాశాన్ని కల్పిస్తున్నాయని అధికారులు తెలిపారు.

## అధైర్య పడొద్దు అండగా ఉంటాం

### - టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కె వహీద్

### - వర్కర్ల అధ్యక్షుడు సుల్తాన్ జీ



కల్వకుర్తి, అక్టోబర్ 14 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణానికి చెందిన టైలర్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యుడు నవాజ్ ఖాన్, సంవత్సరం క్రింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకో వాలనే ఉద్దేశంతో, టైలర్స్ అసోసియేషన్ తరఫున రూ" 30,000 ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె. వహీద్,సుల్తాన్ మాట్లాడు తూ.."మన సంఘంలో సభ్యులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం మా బాధ్యత. నవాజ్ ఖాన్ మృతి చెందినప్పటి నుంచి ఆయన కుటుంబం ఎలాంటి కష్టాలు పడుతుందో మాకు తెలుసు. ఈ ఆర్థిక సహాయం వారి బాధను తగ్గించకపోయినా, కొంత భరోసా కలిగిస్తుందని, ఆశిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో రాజశేఖర్, సలీం, దస్తగిరి, శరత్ కుమార్, నాసరు, శ్రీను, సుజ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారం త్రాగునీరు పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ

మిర్యాలగూడ అక్టోబర్ 14:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ అర్బన్ ఐసీడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సెప్టెంబర్ -17 నుండి అక్టోబర్-16%అ%వరకు పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ రేఖల మమత ఆదేశానుసారం , ఇస్లాంపురం సెక్టార్ , పరిధిలోని సుందర్ నగర్ 1, 2, 3, 4అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం షెడ్యూల్లో భాగంగా ఆరోగ్యకరమైన వంటకాలపై, స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పౌష్టిక ఆహార పదార్థాల వినియోగంపై అవగాహన, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంకిశోర బాలికల కోసం రక్తపరీక్షలు నిర్వహించడం - హీమోగ్లోబిన్ పరీక్షఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమణి మాట్లాడుతూ విటమినులు, మినరల్స్ ప్రోటీన్స్ లభించే ఆరోగ్యకరమైన ఫుడ్ తీసుకోవాలనిప్రతి రోజు మనం తీసుకునే ఆహారంలో ఆకుకూరలు కూరగాయలు పండ్లు మాసం గ్రుడ్లు చేపలు ఎంత ముఖ్యమో చిరుధాన్యాలు కూడా అంతకన్న ముఖ్యం చిరు ధాన్యాలను ప్రతిరోజు మొలకల రూపంలో కానీ జావా రూపంలో కానీ రొట్టెల చేసుకొని తీసుకోవాలని వివరిస్తూ స్థానికంగా దొరికే వస్తువులతో బొమ్మలను తయారు చేసుకొనే విధానాన్ని ఆ బొమ్మలతో పిల్లలకు విద్యాబోధన వలన పిల్లల మానసిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాడుతుందని వివరించారు. చిన్న తనం నుండి ప్రతి ఆడపిల్లకి పోషకాహారం అందిస్తే వారు కౌమార దశలో రక్తిహీనతకు గురికాకుండా కాపాడుకుంటామని కిషోరబాలికకు ఎక్కువగా ఐరన్ కు సంబంధించిన పల్లి పట్టీలు రాగి లడ్డు నువ్వుల లడ్డు లాంటివి ఎక్కువగా ఇవ్వాలన్నారు. పరిసర ప్రాంతాల్లో పాఠశాల ప్రాంతంలో



అంగన్వాడి కేంద్రాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవడం వలన ఆర్గానిక్ పంటలు పండించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరిస్తు పోషణ ఆరోగ్యం పరిశుభ్ర త్రాగునీరు పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె.నాగమణి, అంగన్వాడీ టీచర్స్ పి.పద్మ, టి.శ్రీదేవి, టి.సరిత, ఎ.ఝాన్సీ, హెల్పర్లు స్వరూప రమాదేవి, నాగమణి, సునీత,ఆశ వర్కర్లు కే.రాణి ఎ.మల్లీశ్వరి,కిషోరబాలికలుగర్భిణీలు, బాలింతలు. పెద్దలు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి

మిర్యాలగూడ , అక్టోబర్ 14:- (వార్త మిర్రర్) ప్రధాన మంత్రి సురక్ష యోజన కింద అర్హులను నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. పిఎం సురక్ష బీమా యోజన పథకంపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని పట్టణంలోని ప్రతి ఒక్కరితో మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఎన్రోల్మెంట్ చేయించాలన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం ఏడాదికి ప్రీమియం 20 రూపాయలు మాత్రమే చెల్లించాలని అన్నారు దీనికి 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వారు అర్హులన్నారు. బీమా పాక్షిక వైకల్యంపై అయితే ఒక చేయిలేదు ఒక పాదం ఉపయోగించలేకపోయినట్లైతే వీరికి అర్హత కల్పిస్తామన్నారు. కుటుంబంలో ఎవరికైనా ప్రమాదవశాత్తు మరణం సంబంధించినట్లయితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ స్కీమును ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు అదేవిధంగా జూన్ ఒకటి నుండి మే 31 వరకు ఈ బీమా కవర్ అందుబాటులో ఉంటుందన్నారు. పిఎం సురక్ష బీమా యోజన పథకం కింద అమెజాన్, మీ షో ,మీ జొమోటో, ఫ్లిప్కార్ట్ తదితర షాపింగ్ మాల్ లో పనిచేస్తున్న సేల్స్ మెన్స్ కూడా అర్హులే అన్నారు. పిఎం సురక్ష బీమా యోజన పథకంలో సభ్యులను చేర్పించేందుకు మున్సిపల్




కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రెవిన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, యూనియన్ బ్యాంకు అధికారి నవీన్, మెప్మా టిఎంసి పి.బక్కయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన శాసనసభ్యులు బీర్ల ఐలయ్య - కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

### స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు టికెట్ ఇచ్చి గెలిపించుకోవాలని సూచన.

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిహైదరాబాద్ లో జూబ్లీహిల్స్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆలేరు అభివృద్ధి కోసం గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం పనులు తెలుసుకోవడం జరిగింది ఆలేరు, భువనగిరి అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలునీ విజయవంతం చేస్తున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే లను అభినందించారు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించడం జరిగిందిరాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాని ఎగరవేయాలని కోరడం జరిగింది. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ కేటాయించి గెలిపించుకోవాలని తెలపడం జరిగింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు సానుకూలంగా స్పందించి భువనగిరి, ఆలేరు నియోజకవర్గం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు ఎమ్మెల్యేలు



# బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం స్థలం కబ్జాపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందన

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 : మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బేడ బుడగ జంగం స్థానిక సంక్షేమ సంఘం స్థలంను కాంగ్రెస్ నాయకుడు కమోజీ తిరుపతయ్య కబ్జా చేసినట్టు సంఘం సభ్యులు ఆరోపించారు.సంఘానికి చెందిన స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేయడంతో, వాటిని తొలగించాలని పలుమార్లు కోరినా స్పందించకుండా తిరుపతయ్య ఇది నా స్థలం, ఏం చేసుకుంటారో చేసుకోండి అని బెదిరింపులకు దిగారని వారు పేర్కొన్నారు.ఈ విషయంపై సంఘం సభ్యులు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వెంటనే ఎమ్మార్వోతో మాట్లాడి, ఆ స్థలంపై ఏర్పాటైన డబ్బాలను తొలగించి సంఘం సభ్యులకు తిరిగి అందజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు



అర్కల కామేష్ రెడ్డి, భూపేష్ గౌడ్, సిద్దాల బీరప్ప, శ్రీను నాయక్, సంఘం అధ్యక్షులు పవన్ కుమార్ మరియు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ పాపిరెడ్డి నగర్ వాసులు ఆందోళన..

### కాలనీ అధ్యక్షులు బద్దం కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా....

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్‌లో రోడ్డు సౌకర్యం కల్పించా లంటూ పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు బద్దం కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు కాలనీలోని 1827వ నంబర్ ప్లాట్ ఎదుట నిర్వహించిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో కాలనీవాసు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బద్దం కొండల్ రెడ్డి మాట్లాడుతూ..పాపిరెడ్డి నగర్‌లో ప్రస్తుతం 50 నుండి 60 వేలమంది ప్రజలు నివసిస్తున్నారు. మౌలిక వసతులలో ముఖ్యమైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల వాహనదారులు, విద్యార్థులు, స్కూల్ బస్సులు, అంబులెన్సులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 1827వ నంబర్ ప్లాట్ యజమానులు రోడ్డును కబ్జా చేసుకొని ప్రహరీగోడ నిర్మించడం వల్ల రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని 2020 నుంచే పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాలేదు అని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు సమస్యను



తూతూ మంత్రంగా చూసి వాయిదా వేస్తున్నారని విమర్శించిన ఆయన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మా ఆవేదనను అర్థం చేసుకొని కబ్జా ప్రహరీగోడను తొలగించి రోడ్డు సౌకర్యం కల్పించాలి అని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి రెడ్డి, బసవరాజు, కుమార్, శ్రీనివాస్, స్థానిక మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# టెక్స్ టైల్ పార్కును సందర్శించిన చేనేత జౌళిశాఖ జెడి ఎన్విరావు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 14దండు మల్కాపురం లోని టెక్స్ టైల్ పార్కును చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్వి రావు మంగళవారం సం దర్శించారు. ఈ పార్కులో ఉత్పత్తి చేసిన వస్తువులను అమ్మ కానికి ఏర్పాటుచేసిన ప్రదర్శనశాలను ఆయన పరిశీలిం చారు. ప్రఖ్యాత చిత్రకారిణి రిజిమ కళాఖండాలను తిలకిం చి ప్రశంసించారు. కళాకారుడు శ్రవణ్ వెదురుతో తయా రుచేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ప్రాచీన బాతిక్, బ్లాక్, స్క్రీన్, టై అండ్ డై పద్ధతులను నవీకరించి ప్రముఖ అష్ట కళాకారుడు కే. కృష్ణమూర్తి తయారుచేసిన వస్త్రాలను పరిశీలించి అభినందించారు. ఈ పార్కులోని మరమగాలపై దేవాలయాలకు సరఫరా చేయడానికి కండువాలను టి జి ఎస్ సి ఓ ద్వారా తయారు చేయిస్తున్నట్టు తెలిపారు. మరమగాలపై నేస్తున్న కండువాలను పరిశీలించారు. టెక్స్టైల్ పార్కులో సౌకర్యాలు కల్పించాలని, నిర్వహణ బాధ్యతలను టీజీ ఐఐసీకి అప్పగించాలని ఐలా సర్వీస్ కమిటీ అధ్యక్షుడు ఎం కే డి ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐ ఐ హెచ్ టి సహాయ ప్రిన్సిపల్ కుమార్, సలహాదారు కోప్రసాచారి, చేనేత జౌళి శాఖ ఏడి శ్రీనివాసరావు, అభివృద్ధి అధికారి బాల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# వేములపల్లి పాఠశాలలో పోషణ మాసం

మిర్యాలగూడ, అక్టోబర్ 14:- (వార్త మిర్రర్) బాలబాలికలు ఎక్కువగా చిరుదాన్యాల్లు తీసుకునేలా అలవాటు చేయాలని దామరచర్ల ప్రాజెక్టుసీడీపీఓ ఎన్. చంద్రకళ అన్నారు. దామరచర్ల ఐసీడీఎస్ పరిధి వేములపల్లి మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ లో పోషణ మాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు పోషకాహారం మిల్లెట్స్ చిరుధాన్యాలు, పప్పులు, పాలు, పండ్లు , మునగాకు, గోంగూర, బచ్చలకూర, తోటకూర, క్యారెట్లు బీట్రూట్లు, పల్లీలు, బెల్లం, నువ్వులు, ఖర్జూర, గుడ్లు, మాంసాహారం, చేపలు తీసుకోవాలని పోషకాల స్టాల్ ఏర్పాటు చేసి వివరించారు. పరిసరాల పరిశుభ్రత ,వ్యక్తిగత పరిశుభ్రత, విద్య వల్ల కలిగే లాభాలు, బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, చక్కెర, నూనెలు, ఉప్పు ఎక్కువ తీసుకోకూడదని పిల్లలకు తెలిపారు. సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ లక్ష్మణ్ నాయక్, జడ్పిహెచ్ఎస్ హెచ్ ఎం రమేష్, హెల్త్ సిహెచ్ఓ ప్రవీణ్, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ పరిమి రజని, జే నాగమణి, హెల్త్ సూపర్వైజర్ శాంత, ఏఎన్ఎం శైలజ, కవిత మండలంలోని అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్ విఘ్నేశ్వరి ,బాలురు, బాలికలు పాల్గొన్నారు.

# పశువుల గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మిర్యాలగూడ , అక్టోబర్ 14:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామ పశు వైద్య ఉప కేంద్రం ఆవరణలో నల్లగొండ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వులలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంఈ నెల 15న ప్రారంభించనున్నట్లు, ముఖ్య అతిథులు మిర్యాలగూడ నియోజకవర్గ శాసన సభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ.రమేష్ హాజరు కానున్నారని తుంగపాడు పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్. జ్ఞానేశ్వరప్రసాద్ తెలిపారు.మిర్యాలగూడ పశు వైద్య సిబ్బంది కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు.యాద్గారుపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### సూధం వారి వివాహ మహొూత్సవానికి

# కుటుంబ సమేతంగా విచ్చేయండి

### భారతీయం చైర్మన్ డాక్టర్ రమేష్ సాగర్‌కు పెళ్లి శుభలేఖను అందించిన ం సూధం శేఖర్ సాగర్



హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : వనస్థలిపురం హైకోర్టు కాలనీ నివాసి సాగర్ కన్స్ట్రక్షన్ బిల్డర్ సూదం శేఖర్ సాగర్ - నిర్మల కుమారుడు నవీన్ సాగర్- మనిషా వివాహం మన్నెగూడ వేద కన్వెన్షన్ హాల్లో జరిగే వివాహ మహొత్సవానికి కుటుంబ సమేతంగా హాజరై నూతన వ ధ ూ వ ర ు ల న ు ఆశీర్వదించాలని బంధువు భారతీయం చైర్మన్, వివేకనంద మెడికల్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ రమేష్ సాగర్ నీ కోరి పెండ్లి శుభలేఖను అందించిన సాగర్ కనెక్షన్ బిల్డర్ సూదం శేఖర్ సాగర్ ఈ కార్యక్రమంలో వార్త జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గొల్లూరి గణేష్ సాగర్ పాల్గొన్నారు

### ఎమ్మెల్యే గాంధీ జన్మదిన సందర్భంగా ఈరోజు

### కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో రోగుల కు పండ్ల పంపిణీ..



కొండాపూర్ వార్త మిర్రర్ : నేడు ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ జన్మదిన సందర్భంగా ఉదయం 10 గంటలకు కొండాపూర్ ఏరియా హాస్పిటల్ లో పేషంట్లకు పండ్ల పంపిణీ కార్యక్రమం ను నిర్వహిస్తున్నాం అని ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మీడియా మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘ సేవకులు , పార్టీ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.



### అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

### బిజెపి నాయకుడు తంగెల్ల వెంకటేష్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 14

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి నాయకుడు తంగెళ్ల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను స్థానిక బీజేపీ నాయకులు పరిశీలించారు, ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాల తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి 20వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి బూత్ అధ్యక్షుడు నెట్టు అంజయ్య, నాయకులు పరకాల జగదీష్ గౌడ్, యాట సత్తయ్య, పగిళ్ల అంజిరెడ్డి, రైతులు కాటం యాదయ్య, కాటం గోరయ్య, గంగాదేవి నరసింహ, కాటం స్వామి, మంద చంద్రశేఖర్ కొండ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాయుడు దుంపేట జగన్ అకస్మాత్తు మృతి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 14

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దుంపేట జగన్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మరణవార్త తెలిసి ఉపాధ్యాయ వర్గం విషాదంలో మునిగిపోయింది. ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్, ఉపాధ్యాయులు, స్థానిక తెలుగు పండితులు, సంఘ నాయకులు చెరుకు మహేశ్వర శర్మ తదితరులు ఆయనకు అశ్రునివాళులు అర్పించారు. దుంపేట జగన్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



వార్త మిర్రర్ రాయికల్ రాయికల్ అక్టోబర్ 14

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల మోడల్ స్కూల్ విద్యార్థిని వేముల తన్వి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు పెద్దపల్లి లో నిర్వహించగా, జగిత్యాల జిల్లా బాలికల జట్టు మొదటి స్థానం, బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. ఈ పోటీలలో అద్భుత ప్రదర్శన చేసిన వేముల తన్వి, అక్టోబర్ 16న సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది.విద్యార్థిని తన్వి విజయంపై వ్యాయామ ఉపాధ్యాయుడు వి. కిషోర్ కుమార్, ప్రిన్సిపల్ కొల్లూరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయుల బృందం, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

## ఇంట్లో గొడవ పడి యువకుడు అదృశ్యం



నాగార్జునసాగర్ బ్రిడ్జి వద్ద బైక్ చెప్పులు లభ్యం

మిర్యాలగూడ అక్టోబర్ 14:-( వార్త మిర్రర్) ఇంట్లో గొడవ పడి యువకుడు అదృశ్యమైన సంఘటన మంగళవారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డకు చెందిన భాస్కర శ్రీనివాస్ కుమారుడు భాస్కర సాయిదీప్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చర్లపల్లికి చెందిన పల్లవి అనే యువతిని ప్రేమవివాహం చెసుకున్నాడు. ఇందిరమ్మ కాలనీలో వేరు కాపురం ఉంటున్న వీరికి ఒక కుమారుడు. కాగా ఈ నెల 6న భార్య భర్తలు తగాదా పడ్డారు. గొడవ విషయం తండ్రికి ఫోన్ చేసి చెప్పగా దంపతులిద్దరినీ బంగారుగడ్డలోని సొంత ఇంటికి రమ్మని పిలిచాడు. భార్యని ఇంటి ముందు దింపిన సాయిదీప్, బైక్ పై వెళ్లి పోయాడు. ఎంతకీ ఫోన్ ఎత్తక పోవడంతో బంధు మిత్రులను విచారించిన తండ్రి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ బ్రిడ్జి వద్ద మంగళవారం సాయి దీప్ (29) బైక్, చెప్పులు లభించినట్లు పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ లభించకపోవడంతో సాయిదీప్ కాల్వలో దూకి ఆత్మ హత్యకు పాల్పడ్డాడా లేక తప్పి పోయాడా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. సాయి దీప్ సమాచారం తెలిసిన వెంటనే సెల్ నెంబర్లు 8712670150, 9966 4981 85 సంప్రదించాలన్నారు.

## బీసీలంతా మేల్కొని చైతన్యం

## అవ్వాలి - ఐటిపాముల విజయ్ కుమార్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో బీసీలంతా ఏకం కావలసిన సమయం వచ్చిందని వార్త మిర్రర్ ప్రతినిధి తో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఐటిపాముల విజయ్ కుమార్ అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూమా జాతులను వాడుకొని భుజాలు కాయలు కాసేలా మీ పార్టీల జెండాలు మోసి, మా ఓట్లతో గెలిచిన నాయకులు తిరిగి మమ్మల్ని అవమానపరిచే పరిస్థితి వచ్చిందంటే ఆలోచించాలి బిసి సోదరులారా.! మిత్రులారా..! తెల్లారితే అగ్రకులాల వద్ద ఆశీస్సులు, డబ్బులు తీసుకుంటామా.!బిసి సమాజాన్ని మొత్తాన్ని అఘోర పరిచే విధంగా, మా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే అగ్రకులాల నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా అని అన్నారు.ఇప్పటికైనా బీసీ సోదరులారా చైతన్యమవ్వండి ..మనకు రావాల్సిన రాజ్యాంగ బద్ధంగా జనాభా దామాషా ప్రకారం మన హక్కుల ,రిజర్వేషన్ల కోసం పోరాడుకుందాం, సాధించుకుందాం అని అన్నారు జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఐటిపాముల విజయకుమార్



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు జలపల్లి మున్సిపాలిటీలకు, మహేశ్వరం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, నాయకులు అబ్దుల్లా, అశోక్, విజయ్ , మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## అర్హులకు ప్రమోషన్ల నిరాకరణ దారుణం ..ఔటా

సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 14...ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అర్హత కలిగిన అధ్యాపకులకు ప్రమోషన్లు నిరాకరించడం దారుణమని ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ తెలిపారు. "ప్రతిభా నైపుణ్యం అనే పేరుతో అన్యాయం చేస్తున్నారు. మినిట్స్ రికార్డ్ చేయకపోవడం, రిజెక్షన్ కారణాలు వెల్లడించకపోవడం పారదర్శకత లేకపోవడమే" అని విమర్శించారు. బెస్ట్ టీచర్, బెస్ట్ రీసెర్చర్ అవార్డు పొందిన అధ్యాపకులను కూడా రిజెక్ట్ చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రమోషన్లలో అవకతవకలపై ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటేశ్వరరావు, వెంకట్ దాస్, రోజారాణి, సుజాత, అపర్ణ, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయ స్థలం ఆక్రమణపై వెంటనే చర్యలు తీసుకోవాలి: భారతీయ జనతా పార్టీ

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్పల్లి సమీపంలోని అతి పురాతన హనుమాన్ దేవాలయ స్థలం కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించారు.ఈ విషయం పై గతంలోనే పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ మరియు జల్పల్లి మున్సిపల్ కమిషనర్ కి స్థానిక హిందూ భక్తులు మరియు నాయకులు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ అన్నారు హనుమాన్ దేవాలయ స్థలాన్ని కబ్జా చేసి కూడా ప్రభుత్వం మౌనంగా ఉండటం అత్యంత దారుణం.మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హిందూ దేవాలయం స్థలం కబ్జా చేయబడినా చూస్తూ ఊరుకోవడం ఎవరి మెప్పుకోసం? ప్రజలకు సమాధానం చెప్పాలి కొంతమంది బిఆర్ఎస్ నాయకులు మేము కూడా హిందువులం అని ప్రెస్ మీట్లు పెట్టడం కాదు ఇలాటి సమస్య వచిన్నపుడు మందుకురావాలి ఎన్నికల సమయంలో దొంగ జీవోలు, వాగ్దానాలు, ముసుగులు ధరించి ఓట్లు దోచుకున్నవారు ం ఇప్పుడు హిందూ దేవాలయాలను మట్టిలో కలపడానికి ప్రయత్నించడం ప్రజల భావోద్వేగాలపై దాడిభారతీయ జనతా పార్టీ స్పష్టంగా హెచ్చరిస్తోంది ం హనుమాన్ దేవాలయ స్థలం కబ్జా చేసే ప్రయత్నాలు వెంటనే ఆపాలి. ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ తక్షణం విచారణ ప్రారంభించాలి. హిందూ దేవాలయాలపై దాడులు కొనసాగితే బీజేపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఉద్యమం చేపడుతుంది. సనాతన ధర్మాన్ని, హిందూ దేవాలయాలను రక్షించడం భారతీయ జనతా పార్టీ ధర్మం.హనుమాన్ దేవాలయాల జోలికొస్తే కాంగ్రెస్ అయినా, బిఆర్ఎస్ అయినా ఖబర్దార్! ఈ కార్యక్రమంలో జలపల్లి మున్సిపల్ అధ్యక్షులు మనోజ్



బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి గురిగే శ్రీకాంత్ బాలా శివుడుగౌడ్ గౌరా మురళి రావుల భరత్ హరికృష్ణ గుర్రం శివ రాకేష్ రవి కొంతం మురళీధర్ రెడ్డి రామాచారి కళ్లెం మురళీధర్ రెడ్డి ప్రవీణ్ గౌడ్ పవన్ పటేల్ సతీష్ నందా నరసింహ మల్లెల మహేందర్ మరియు తదితరులు పాల్గొన్నారు

## ఆస్తి పన్ను సిబ్బంది క్షేత్రస్థాయిలో మరింతగా కృషి చేయాలి

**వంద శాతం ఆస్థి పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి....**

**జడ్‌సీ హేమంత్ బోర?డ్ ఐఎఎస్.....**




శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : బల్దియాలో తగు ప్రాధాన్యత కలిగిన శేరిలింగంపల్లి జోన్‌లో ఆస్థి పన్ను వసూళ్లను అత్యంత పకడ్బందీగా వసూలు చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే ఐ.ఏ.ఎస్. పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా వంద శాతం చేరుకోవాలని ఆదేశించారు. కొన్ని డాకెట్స్?లలో సాధారణ పురోగతి నమోదవుతున్నదని వాటిల్లో సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. జోన్ పరిధిలో ఆస్థిపన్ను వసూళ్ల పురోగతిపై డీసీలు, పన్ను విభాగం ఏఎంసీలు, ట్యాక్స్? ఇన్స్పెక్టర్ ల తో జోనల్ కమీషనర్ హేమంత్ బోర?డే ఐ ఏ ఎస్ , మంగళవార%శీ% జోనల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, పటాన్‌చెరు ఆర్‌సీపూర్ సర్కిళ్ల వారీగా ఇచ్చిన లక్ష్యంతో పాటు చేరుకున్న లక్ష్యాన్ని 34 డాకెట్ల వారీగా



సమీక్షించారు. అనంతరం జడ్‌సీ హేమంత్ బోర?డే ఐఎఎస్ మాట్లాడుతూ.... 2025-26 ఆర్థికక సంవత్సరానికి గాను రూ. 557.25 కోట్ల లక్ష్యం నిర్ధరణ కాగా ...ఇప్పటి వరకు రూ. 326.58 కోట్ల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకున్నట్లు పేర్కొన్నారు. వేడుకలు, పలు ఎన్నికలు , పండుగల నేపథ్యంలో కొంత మేర పన్ను వసూళ్ల పురోగతి మందగించిందని, ఇక నుంచి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని జెడ్సి సూచించారు. ప్రధానంగా శేరిలింగంపల్లి, చందా నగర్ సర్కిళ్లు మరింత పురోగతిని చూపించాలని ఆదేశించారు. కొన్ని డాకెట్లలో పన్ను వసూళ్లు ఆశాజనకంగా లేవని, సంబంధిత ఏఎంసీలు పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టి వేగవంతం అయ్యేలా చూడాలని జడ్‌సీ హేమంత్ బోర?డే ఐఎఎస్ ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో అయిదున్నర నెలలే ఉన్నందున ఆస్థిపన్ను వసూళ్ల వంద శాతం లక్ష్యాన్ని గడువులోగానే చేరుకోవాలని స్పష్టం చేసారు. ఇక నుంచి ఈ ప్రక్రియపై నిరంతరం సమీక్షలు చేపడతామని, అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోబోమని జోనల్ కమీషనర్ హేమంత్ బోర?డ్ ఐఎఎస్ పేర్కొన్నారు. ఆస్థిపన్ను వసూళ్లపై అభివృద్ధి పనులు ఆధారపడి ఉన్నందున సిబ్బంది మరింత మెరుగైన పనితీరును కనబరచాలన్నారు.


## ఓయూ రిజిస్ట్రార్‌కు సన్మానం.. 47వ అఖిల భారత అకౌంటింగ్ మహాసభలో అద్భుత ప్రదర్శన


సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 14..... ఉదయ్‌పూర్‌లోని జనార్దన్ రాయ్ నగర్ రాజస్థాన్ విద్యాపీఠ్ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)లో అక్టోబర్ 12 నుంచి 13 తేదీల్లో జరిగిన ప్రతిష్ఠాత్మక 47వ అఖిల భారత అకౌంటింగ్ మహాసభ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) తన అకడమిక్ నైపుణ్యాన్ని, జాతీయ స్థాయిలో పెరుగుతున్న ప్రభావాన్ని మరోసారి ప్రదర్శించింది.ఓయూ, కాకతీయ విశ్వవిద్యాలయం వాటి అనుబంధ కళాశాలల వాణిజ్య విభాగాల నుండి 35 మంది ప్రతినిధుల బృందం ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొంది. ఈ బృందంలో అధ్యాపక సభ్యులు, పరిశోధక విద్యార్థులు ఉన్నారు.ప్రధాన పురస్కారం, విద్యా నాయకత్వం, ఓయూ ప్రతినిధుల బృందం ఈ సమావేశంలో ముఖ్యమైన ఘనతను సాధించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, జాతీయ కోశాధికారైనా ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి తన పరిశోధక విద్యార్థి డా. కె. ప్రీతితో కలిసి సమర్పించిన ఉమ్మడి పరిశోధనా పత్రానికి ఉత్తమ పరిశోధనా పత్రం అవార్డును అందుకున్నారు.అలాగే, పలువురు ఓయూ మరియు అనుబంధ అధ్యాపక సభ్యులు వివిధ సాంకేతిక సమావేశాలలో కీలక నాయకత్వ స్థానాలను అలంకరించారు:ప్రొఫెసర్ (రిటైర్డ్) వి. అప్పా రావు "అకౌంటింగ్ విద్యపై అంతర్జాతీయ సెమినార్" సాంకేతిక సమావేశానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.ప్రొఫెసర్ (రిటైర్డ్) కె. వి. అచలపతి అకౌంటింగ్ విద్య సెషన్‌కు కీలకోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ (రిటైర్డ్) వి. ఉషా కిరణ్ "అకౌంటింగ్ పరిశోధనపై అంతర్జాతీయ సెమినార్"కు కీలకోపన్యాసకులుగా పనిచేశారు. ప్రొఫెసర్ ఎ. పాట్రిక్ అకౌంటింగ్ పరిశోధనపై జరిగిన మరో సెషన్‌కు కో-ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతినిధులందరూ చురుకుగా పాల్గొని, తమ పరిశోధనా పత్రాలను సమర్పించడం ద్వారా విద్యా చర్చకు గణనీయంగా దోహదపడ్డారు. పెరుగుతున్న జాతీయ ప్రాతినిధ్యంఈ సదస్సు ఓయూ పరిపాలనా ప్రాతినిధ్యాన్ని జాతీయ సంస్థలో బలోపేతం చేయడానికి ఒక కీలకమైన మెట్టుగా



నిలిచింది. హర్యానాలోని మహేంద్రగఢ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హర్యానాలో జరగబోయే 48వ అఖిల భారత అకౌంటింగ్ మహాసభ కోసం కింది అధ్యాపక సభ్యులు కార్యనిర్వాహక కమిటీ (%జుజ%)కి పదోన్నతి పొందారు:ప్రొఫెసర్ ఎం. గంగాధర్ (ఓయూ): ఈసీ సభ్యులు (ఎన్నికయ్యారు) ప్రొఫెసర్ ఎస్. కవితా దేవి (ఓయూ): ఈసీ సభ్యులు (కో-ఆప్టెడ్) ప్రొఫెసర్ కట్ల రాజేందర్ (కేయూ): ఈసీ సభ్యులు (కో-ఆప్టెడ్) 360 మంది క్రియాశీల సభ్యులతో, ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ యొక్క హైదరాబాద్ శాఖ ఈ ప్రాంతంలో పరిశోధన మరియు విద్యా సహకారానికి శక్తివంతమైన కేంద్రంగా కొనసాగుతోంది. పౌర సంబంధాల అధికారి ఉస్మానియా విశ్వ విద్యాలయం

## రైతులకు ఇబ్బంది కలగకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి





మిర్యాలగూడ అక్టోబర్ 14:-( వార్త మిర్రర్) రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2025- 26 ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ వానాకాలం ధాన్యం కొనుగోలులో రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మిల్లులకు పంపించే విధంగా జిల్లా యంత్రాంగం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. నాణ్యత ప్రమాణాల విషయంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అన్ని మండలాలలో అందుబాటులో ఉండి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే తక్షణమే మిల్లులకు పంపించే విధంగా చూడాలని, మిల్లర్లు తక్షణమే మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కోరారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ట్రాన్స్పోర్టర్లు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హమాలీల సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు లో భాగంగా రైస్ మిల్లర్లు 5 రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని కోరారు. మిల్లర్లకు సంబంధించిన సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం మద్దతు ధరపై రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరఫున ప్రజల ఆరోగ్య సంక్షేమానికై ఎక్స్ రే యంత్రాన్ని అందించడం పట్ల జిల్లా కలెక్టర్ రైస్ మిల్లర్లను అభినందించారు .రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో, అలాగే మిల్లుల వద్ద రైతుల నుండి కమిషన్ తీసుకున్నట్లు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని రైతులు తీసుకురావాలని, ఆ విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులతో కోరారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు జి.శ్రీనివాస్, నారాయణ, భద్రాద్రి, యాదగిరిలు మాట్లాడుతూ పూర్తి నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, పెండింగ్ లో ఉన్న ట్రాన్స్పోర్ట్ చార్జీలను ప్రభుత్వం ద్వారా వెంటనే చెల్లించే ఏర్పాటు చేయాలని, గోదాముల్లో బియ్యంనిల్వ ఉంచేందుకు కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్ కుమార్, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.